క్లుప్తంగా

గర్భిణులకు అన్నదానం



భోజనాలు చేస్తున్న గర్భిణులు

గరుగుబిల్లి: వైద్య తనిఖీల నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం వచ్చిన గర్భిణులకు స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో అన్నదానం చేశారు. పీఎంఎస్‌ఎంఏ పథకం కింద ప్రతినెలా తొమ్మిదో తేదీన గర్భిణులకు వైద్య తనిఖీలు చేస్తుండగా, వారికి దాతల సహకారంతో అన్న ప్రసాదం వితరణ చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అన్నదాతలకు పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.కె.సాగర్‌వర్మ, సంతోష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

'మత్తు'తో జీవితం చిత్తు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళాధర్

వీరఘట్టం: గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. స్థానిక సీఎస్పీ రోడ్డులో యు.వెంకమ్మపేట వద్ద మత్తు పదార్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలతో జీవితం నాశనమవుతుందని, వాటి జోలికి వెళ్లవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దన్నారు.

అప్రమత్తం...

పాలకొండ రూరల్: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడడంతో మంగళవారం నుంచి ఓ మోస్తారు, తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ ఎ.డి కె.రత్నకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో నూర్పిళ్లు చేపట్టదలచిన రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కళ్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పాలన్నారు. వర్షాలు కురిస్తే అపరాల పంటలకు మేలు చేకూరుతుందని పేర్కొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం రేపు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో జరిగే వారపు సంత వద్ద మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం బుధవారం నిర్వహిస్తున్నట్లు స్థానిక విశ్రాంత వైద్యుడు జి.ప్రభాకరరావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు హాజరై, రోగుల కళ్లను తనిఖీ చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడంతో పాటు ఆపరేషన్లకు రిఫర్ చేస్తారన్నారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఉచితంగా శస్త్రచికిత్స చేయడంతో పాటు కళ్లద్దాలు, మందులు, వసతి, బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరి కోతలు ఆపండి



గరుగుబిల్లిలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో విజయభారతి

గరుగుబిల్లి: వరి కోతలను తాత్కాలికంగా నిలుపుదల చేయాలని ఏవో ఆర్.విజయభారతి సూచించారు. మండలంలోని సంతోషపురం, గరుగుబిల్లి, సుంకి తదితర గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఆమె.. ధాన్యం నూర్పిడిలు, ధాన్యం భద్రతకు రైతులు చేపడుతున్న చర్యలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం చేపడుతున్న వరి కోతలను ఆపాలని తెలిపారు.

కొనలేం.. తినలేం..

- వినియోగదారునిపై బాదుడే.... బాదుడు
- సాధారణ కూరగాయలతో పాటు పప్పుదినుసుల ధరలకు రెక్కలు
- సలసల కాగుతున్న వంట నూనె ధరలు
- కొండెక్కిన కోడి గుడ్డు
- కానరాని ధరల నియంత్రణ



బహిరంగ మార్కెట్‌లో కూరగాయలు

పాలకొండ రూరల్: సంపద సృష్టి మాట అలా ఉంచితే.. సామాన్యుడిపై ధరల ప్రభావంతో బాదుడే... బాదుడు కొనసాగుతోంది. సర్కారు హామీలు పక్కన పెడితే పెరుగుతున్న ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. పండగల సీజన్ ప్రారంభం కావడంతో సగటు మనిషి ఏమి ఉన్నా లేకున్నా.. కడుపు నిండా ఇంత తిండి దొరికితే చాలు అనుకునే పరిస్థితి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో నిత్యావసర సరుకులతో పాటు విద్యుత్ చార్జీలు కూడా పెరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యావసర సరుకుల ధరలకు నానాటికి రెక్కలు వస్తున్నాయి. కూరగాయలు, పప్పు దినుసులు, వంటనూనెలు, చికెన్, గుడ్లు.. ఇలా ఏ ఆహార వస్తువు కొనాలన్నా కాస్తా ఆలోచించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నెలవారీ జీతాలు పెరగకపోయినా నిత్యావసర సరుకుల ధరలు రోజుకోరకంగా ఉంటున్నాయి. బియ్యం ధర మొదలు ఉల్లి, వెల్లుల్లి వైపు చూడడానికి కూడా జంకే పరిస్థితి. ఎన్నడూ లేనట్లు వెల్లుల్లి కిలో రూ.350 పైగానే పలుకుతోంది. చికెన్ రూ.210 నుంచి రూ.240 వరకు పెరిగింది.

పరుగులెడుతున్న గుడ్ల ధరలు..

బహిరంగ మార్కెట్‌లో ధరలు ఒకలా ఉంటే మారుమూల గ్రామాల్లో కోడిగుడ్ల ధరలు కొంత అధికంగా ఉంటాయి. ఏ రోజు ఎలా ఉంటాయో అర్థం కాని పరిస్థితి. నెల రోజుల కిందట 30 గుడ్ల ధర రూ.140 నుంచి రూ.150 ఉండగా.. ప్రస్తుతం ఆ ధర 225 రూపాయలకు చేరుకుంది. పట్టణంలోని దుకాణాల్లో గుడ్డు రూ.7.50 ఉండగా.. గ్రామాల్లో ఎనిమిది రూపాయలకు అమ్ముతున్నారు.



నిత్యావసర సరుకులు

అందని పౌష్టికాహారం..

అన్ని రకాల వస్తువుల ధరలు మండుతుండడంతో సామాన్యులు కొనుగోలుకు వెనకాడుతున్నారు. గతంలోలా వ్యాపారాలు లేవని వ్యాపారులు కూడా చెబుతున్నారు. ఏ కూరగాయ కొనాలన్నా రూ. 60 నుంచి వంద రూపాయల మధ్య విక్రయిస్తున్నారు. కందిపప్పు కిలో రూ.180 నుంచి రూ.190.. శనగపప్పు రూ.95 నుంచి రూ.వంద.. నూనె రకాన్ని బట్టి రూ.135 నుంచి రూ.175వరకు ఉండగా ఉల్లి కిలో రూ.40 నుంచి రూ.45, వెల్లుల్లి కిలో రూ.350 నుంచి రూ.380 వరకు పలుకుతోంది.

కొనలేకపోతున్నాం..



అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. ఆకుకూరలు, కూరగాయల నుంచి వంట సరుకులు, నూనెల ధరలు ఎక్కువగా ఉండడంతో అన్నివర్గాల వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. సాధారణ కూరగాయలు కూడా కొని తినే పరిస్థితి లేదు. గుడ్డు ఎనిమిది రూపాయలకు విక్రయిస్తున్నారు. ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలమైంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలు బతకలేకపోతున్నారు.

– కె.కల్పన, గృహిణి, అట్టలి గ్రామం, పాలకొండ మండలం



వెల్లుల్లి

ఎమ్మెల్సీ గెలుపుపై హర్షం



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు

వీరఘట్టం: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీగా యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి, పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి మొదటి రౌండ్‌లోనే గెలుపొందడంపై యూటీఎఫ్ మండల శాఖ హర్షం ప్రకటించింది. ఈ మేరకు మండల శాఖ ప్రతినిధులందరూ సోమవారం మండల కేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ తనదైన ముద్ర వేసిందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తోందని చెప్పారు. అందుకే ఎమ్మెల్సీ గెలుపు సులువైందన్నారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.రాజకుమారి, బోనంగి దుర్గాప్రసాద్, కురమాన గోవిందరావు, ఎ.స్వామిబాబు, ఎస్.విశాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి



విద్యార్థుల ప్రాజెక్టులను తిలకిస్తున్న కేవీకే సమన్వయకర్త ధ్రువ తదితరులు

గరుగుబిల్లి: రైతులంతా ఆధునిక వ్యవసాయ విధానాలు, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ ఎస్.ధ్రువ సూచించారు. మండలంలోని సంతోషపురం గ్రామంలో నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం ప్రదర్శించిన వ్యవసాయ ప్రాజెక్టులను తిలకించి, పలు సూచనలు చేశారు. అధిక దిగుబడుల సాధనకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి, ప్రొఫెసర్ బి.రాజేంద్రకమార్, శాస్త్రవేత్తలు, సర్పంచ్ అంబటి తవిటినాయుడు, జట్టు ట్రస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు..

భామిని: సచివాలయ ఉద్యోగులు హౌస్ టూ హౌస్ సర్వే చేసి విధులు నిర్వహించాలని, ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని ఎంపీడీఓ కె. సత్యం అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విధులకు డుమ్మా కొడితే సహించేది లేదన్నారు. ప్రతి సచివాలయన్నీ ఆకస్మికంగా తనిఖీ చేస్తానని చెప్పారు. ఈఓపీఆర్‌డీ కె. కృష్ణారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే చర్యలు తప్పవు

పార్వతీపురంటౌన్: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ బాధ్యతను పిల్లలే తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రా రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో గిరిజనాభివృద్ధి సహాయ ప్రాజెక్టు అధికారి మురళీధరన్, కలెక్టరేట్ ఎఫ్–సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీరామ్మూర్తితో కలిసి ఆయన పాల్గొన్నారు. అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచి ఉద్యోగం వచ్చేవరకు పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో పోషించాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను విస్మరించిన వారికి చట్ట ప్రకారం శిక్ష తప్పదని స్పష్టంచేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అనీష్

జియ్యమ్మవలస: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ అనీష్ సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదమేరంగి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు–వాటి దుష్ప్రభావాలపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత, విద్యార్థులు ఎక్కువగా ఫ్యాషన్ మాయలో పడి గంజాయి, కొకైన్, హెరాయిన్, మద్యం, ధూమపానం, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితం నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి నడవడిక అలవర్చుకుని, ఉత్తమ జీవనం సాగించాలని ఆకాంక్షించారు. జూనియర్లను ర్యాగింగ్ చేయొద్దన్నారు. స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులు, ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దన్నారు.

పోరాటాలకు సిద్ధం



- ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: కూటమి ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ స్పష్టం చేశారు. ధాన్యం అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రైతులకు రూ 20 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం అధికారంలోనికి రాగానే ఆ హమీని గాలికి వదిలేసిందని ఆరోపించారు. పెట్టుబడుల కోసం అప్పులు చేసి సాగు చేపట్టిన రైతులకు ప్రస్తుతం ధాన్యం అమ్ముకోలేని దుస్థితిలో ఉన్నారని..దీనికి ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 13న నిరసన కార్యక్రమాన్ని చేపట్టి జిల్లా కలెక్టర్‌కు తమ పార్టీ తరఫున వినతి పత్రం అందిస్తామన్నారు.

ఇబ్బంది పెట్టిన వారిని అరెస్ట్ చేయాలి..



తహసీల్దార్, ఎస్సైలకు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘ నాయకులు

భామిని: దళిత కులాలకు చెందిన క్రీడాకారులను పెద్దదిమిలి గ్రౌండ్‌లో ఆడనివ్వని ఆదె గ్రామానికి చెందిన కడగళ శ్రీను, అతని అనుచరులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని దళిత సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఎస్సై ఎన్. అనిల్‌కుమార్‌లను సోమవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు.

నేటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో మంగళవారం నుంచి సీపీఎం పదో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సభలకు ముఖ్య అతిథులుగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.తులసీదాస్, కె.సుబ్బారావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్, రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి తదితరులు విచ్చేస్తారని తెలిపారు. కురుపాం పాతబస్టాండ్ నుంచి రావాడ జంక్షన్ వద్ద జరిగే సభ ప్రాంగణానికి ర్యాలీగా వెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉద్యోగులను బెదిరించడం తగదు..

- గిరిజన జేఏసీ నాయకులు బి. శ్రీనివాసరావు, బి.అప్పారావు
- సీతంపేటలో ర్యాలీ చేపట్టిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు



ఐటీడీఏ ముందు శాంతియుత ర్యాలీ

సీతంపేట: గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులను సమస్యలను పరిష్కరించకపోవగా.. షోకాజ్ నోటీసులతో బెదిరించడం తగదని గిరిజన జేఏసీ నాయకులు బి. శ్రీనివాసరావు, బి. అప్పారావు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులు సీతంపేటలో సోమవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గిరిజన, ఉద్యోగ, రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు తరలివచ్చారు. ముందుగా స్థానిక హైస్కూల్ వద్ద ప్రారంభమైన ర్యాలీ ఐటీడీఏ వరకు సాగింది. మధ్యలో బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం ఐటీడీఏ గేటు వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపకులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన జేఏసీ నాయకులు బి.శ్రీనివాసరావు, బి.అప్పారావు మాట్లాడుతూ.. 21 రోజులుగా ఉపాధ్యాయులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలకు చేస్తుండడంతో గిరిజన విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలని కోరారు. అలాగే డీఎస్సీ నుంచి అవుట్ సోర్సింగ్ పోస్టులను మినహాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.లక్ష్మణరావు, ఎస్.చిరంజీవి, హెచ్.మోహనరావు, కె.భాస్కరరావు, ఎస్.గంగారావు, ఎన్.కాంతారావు, హరిప్రసాద్, సాయికుమార్, బి.రామ్మోహనరావు, పి.పురుషోత్తం, కె.ప్రమోద్, బి.ఉమామహేశ్వరరావు, బి.గణేష్, బి.ధర్మారావు, వెంకునాయుడు, బి.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు వివరాలు చెప్పొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నీలకంఠారావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): అపరిచిత వ్యక్తులకు బ్యాంకు వివరాలు చెప్పవద్దని నీలకంఠాపురం ఎస్‌ఐ నీలకంఠారావు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా కురుపాం మండలంలోని నీలకంఠాపురం వారపుసంత వద్ద ప్రజలకు సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మత్తు పదార్థాలు–వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలు, రోడ్డు భద్రతా నియమాలు, బాల్యవివాహాల నిర్మూలన వంటి వాటిపై సోమవారం అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులపై క్లిక్ చేయొద్దని, వాటిని క్లిక్ చేస్తే సైబర్ నేరగాళ్లు మన సొమ్మును దోచేస్తారని ఆయన తెలిపారు. అలాగే గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా, మద్యం, ధూమపానం వంటివి చేయొద్దన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు.

14 వినతుల స్వీకరణ



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్లలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 14 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు.

భూ సంబంధిత సమస్యలపై పలువురు ఫిర్యాదు చేశారని, వాటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్వే డీటీ ప్రసాదరావు, ఆర్‌ఐ లక్ష్మంనాయుడు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

పాలకొండను కరువుప్రాంతంగా ప్రకటించండి

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: చీడపీడలు, తెగుళ్లతో ఖరీఫ్ వరి పంట పోయిందని.. దిగుబడులు కూడా బాగా తగ్గిపోవడంతో పాలకొండను కరువు ప్రాంతంగా ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి డిమాండ్ చేశారు. మండలంలోని వండువలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, పాలకొండ నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో ఎకరాకు కనీసం 10 బస్తాల దిగుబడి కూడా రావడం లేదని.. ఇంత ఘోరంగా గతంలో ఎన్నడూ పంటలు దెబ్బ తినలేదని చెప్పారు. నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి నాలుగు మండలాల రైతులను ఆదుకోవాలని కోరారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో వరి పంటను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వాలని కోరారు.

విద్యుత్ చార్జీలు పెంచడం దారుణం..



పొట్నూరు లక్ష్మణరావు

వీరఘట్టం: ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక చార్జీలు పెంచడం దారుణమని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పొట్నూరు లక్ష్మణరావు అన్నారు. మండలంలోని తెట్టంగిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తనమార్కు రాజకీయంతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించడంతో పాటు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోతే పోరాటం తప్పదని స్పష్టం చేశారు.

రహదారికి మరమ్మతులు



రాయుడు కోనేటి మలుపులో మరమ్మతులు చేసిన రహదారి

సాక్షి ఎఫెక్ట్...

పాలకొండ రూరల్: డివిజన్ కేంద్రంలోని రాయుడు కోనేటి నుంచి అగ్నిమాపక కేంద్రం వరకు ఉన్న రహదారి మలుపులో అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ రోడ్డు గోతులతో అధ్వానంగా తయారవడంతో వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఇటీవల సాక్షిలో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. ఈ పనులకు రూ. 24 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ టి. కిరణ్‌కుమార్ తెలిపారు. గాయత్రి ఆలయం నుంచి నవగాం కూడలి వరకు మరమ్మతులు చేపడతామన్నారు.

పత్తిలో అంతరపంటగా కంది సాగు



గుమ్మలక్ష్మీపురం మండలంలోని చెముడుగూడ, మురడ, అడ్డంగూడ, కొత్తవలస, బుడ్డెమ్మఖర్ల తదితర గ్రామాల్లో పత్తి పంటలో అంతర పంటగా కంది పంటను అక్కడి రైతులు సాగు చేస్తున్నారు. ప్రధాన పంట మధ్యలో అంతర పంటగా ఏదో ఒక పంటను సాగు చేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతోందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం అన్నిచోట్లా ఈ తరహా సాగు చేస్తుండడం గమనార్హం. –గుమ్మలక్ష్మీపురం

వర్ష సూచన..



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాబోయే రెండు రోజుల్లో వర్ష సూచన ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి జక్కువ సౌజన్య సూచించారు. వీరఘట్టం, చిదిమి, తలవరం, రేగులపాడు గ్రామాల్లో సోమవారం పర్యటించి పంట పొలాల్లో ఉన్న రైతులతో మాట్లాడారు. కోసిన వరి పనలను కుప్పలుగా వేసి టార్పాలిన్లు కప్పాలని సూచించారు. అలాగే నూర్చిన ధాన్యాన్ని రైతుసేవా కేంద్రాల ద్వారా విక్రయించి మిల్లులకు తరలించాలన్నారు. – వీరఘట్టం

ఆర్థిక అక్షరాస్యత సాధించాలి..



మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలని స్త్రీ నిధి ఏజీఎం హేమలత సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఎఫ్, వీఓఏలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో వాయిదాల పద్ధతిలో కట్టేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కనుగుల లలితకుమారి, ఏపీఎంలు చిన్నతల్లి, కెల్ల రాము, తదితరులు పాల్గొన్నారు. – వీరఘట్టం